
## సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు



4లో

RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 23 -02 - 2024

సంపుటి: 1 | సంచిక : 277 | పేజీలు : 4 | వెల : 5/-

# అవి పాతరేనా..?

## కొత్త నోటిఫికేషన్.. మరి పాతోళ్ల సంగతేంటీ

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : న్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే కాస్త అటు ఇటు తేదీలతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి సోమవారం సాయంత్రం ప్రకటన విడుదల చేసింది. కొన్ని పోస్టులు పెంచి మొత్తం 563 పోస్టులతో టీఎస్ పీఎస్ సీ నూతన ప్రకటన జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు సంబంధించి ఫిబ్రవరి 23 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది. మార్చి 14న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగుస్తుంది.. ఈ దరఖాస్తులను ఆన్లైన్ విధానంలోనే టీఎస్ పీఎస్ సీ( స్వీకరిస్తుంది. నిరుద్యోగులు ఎంతగానో ఎదురుచూ-స్తున్న వేళ టీఎస్ పీఎస్ సీ ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో వారిలో కొన్ని సందేహాలు



వ్యక్తమవుతున్నాయి.భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఆధ్వర్యంలో గత ఏడాది ఏప్రిల్ నెలలో 503 పోస్టులు భర్తీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఉ ద్యోగాలకు సంబంధించిన ప్రకటన కూడా విడుదల చేసింది. ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మూడు లక్షల 50 వేల మంది దరఖాస్తు చేసుకు న్నారు. ఏడాది అక్టోబర్

మిగతా 2వ పేజీలో...

## మేడారంకు జాతీయ హోదా ఇవ్వలేం..!

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ములుగు - ప్రభాతసూర్యుడు : మేడారం మహా జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకున్నారు. తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడి పంటలతో దేశం అంత సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నాని తెలిపారు. అలాగే ములుగులో గిరిజన వర్సిటీ తాత్కాలిక క్యాంపస్

మిగతా 3వ పేజీలో...





# కొలువుదీరిన సమ్మక్క, సారమ్మ


వరంగల్, ప్రభాతసూర్యుడు : రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర ఈ ఏడాది వైభవంగా జరుగుతోంది. జాతరలో మొదటిరోజైన బుధవారం సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో మేడారం భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. ఇక సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి స్వాగతించేందుకు మేడారం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురుచూస్తోంది. తరలివచ్చిన సారలమ్మ బుధవారం అర్ధరాత్రి 12.12 గంటలకు గద్దెను అలంకరించింది. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారలమ్మకు స్వాగతం పలికారు. సారలమ్మను దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే కన్నెపల్లికి భక్తజనం పోటెత్తింది. పూజల తరువాత కన్నెపల్లి నుంచి 16 మంది ఆడబిడ్డలు సంప్రదాయం ప్రకారం డోలి విన్యాసాలతో తరలివచ్చి తల్లీబిడ్డలైన సమ్మక్క-సారలమ్మ కొలువుదీరే గద్దెలపై ముగ్గులు పెట్టి కంకవనానికి కంకణాలు కట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచే కన్నెపల్లి సారలమ్మ గుడి వద్ద డోలి విన్యాసాలు, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి పరిషత్, సారలమ్మ యువజన సంఘం బృందాల సారథ్యంలో కళా ప్రదర్శనలు కొనసాగాయి. అదే సమ-యంలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య సహా ఇతర పూజారులు సారలమ్మ గుడిలో వారి ఆచార సంప్రదాయాలను ఆచరించారు. కన్నెపల్లిలో ఇల్లిల్లూ



మిగతా 2వ పేజీలో...

# పెద్దల సభకు అన్నీ ఏకగ్రీవమేనా

న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు : భారత పార్లమెంటు వ్యవస్థ ప్రపంచ ప్రజాస్వామ్యానికి దివిటీగా పేర్కొన్నారు తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ. ఇక్కడ ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపులు, లాలింపులు, వ్యక్తి ప్రధాన రాజకీయాలకు తావు లేదని చెప్పుకొచ్చారు. దీంతో ప్రపంచ పార్లమెంటరీ వ్యవస్థల్లో భారత్ ఒక కీలక దిక్సూచిగా మారింది. ఒక నిఘంటువుగా నిలిచింది. అయితే.. రానురాను.. ఈ పార్లమెంటరీ వ్యవస్థపై అనేక సందేహాలు.. సమస్యలు.. అనుమా నాలు.. ప్రశ్నలు.. ముసురుకుంటున్నాయి. ఏకపక్ష రాజకీయాలు, వ్యక్తి పూజలు, పార్టీల ఒంటెత్తు పోకడలు.. వంటివి పెరిగాయి. దీంతో పార్లమెంటరీ వ్యవస్థ ఇప్పుడు శీలపరీక్షకు నిలబడాల్సిన పరిస్థితి



ఎదురవుతోందన్న మేధావుల మాట తరచుగా వినిపిస్తూనే ఉంది. తాజాగా పార్లమెంటులో అత్యంత కీలకమైన రాజ్యసభకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నెల 27న దానికి ముహూర్తం కూడా ఖరారు చేశారు. 56 మంది సభ్యులు రానున్న ఏప్రిల్‌లో

మిగతా 2వ పేజీలో...

# కరెంట్ కట్ చేస్తే.. సస్పెండ్

### విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సీఎం ఆగ్రహం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : రాష్ట్రంలో ఎక్కడైనా అకారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇప్పుడున్న అవసరాలకు సరిపడేంత విద్యుత్తును ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ప్రభుత్వం తరఫున ఎక్కడా విద్యుత్తు కోతలను విధించటం లేదని సీఎం స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా పెరిగిందని చెప్పారు. ఇటీవల పలు చోట్ల విద్యుత్తు సరఫరా నిలిపేసిన సంఘటనలపై ముఖ్యమంత్రి విద్యుత్తు శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు, విద్యుత్తుపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అటువంటి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. గతంతో పోల్చితే విద్యుత్ సరఫరా పెంచినప్పటికీ, కోతలు పెడుతున్నారంటూ



జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీదేనని విద్యుత్తు శాఖ అధికారులను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు. సచివాలయంలో గృహజ్యోతి, రూ.500కే సిలిండర్ పథకాలపై సమీక్షకు ముందు ముఖ్యమంత్రి విద్యుత్ కోతలపై సాగుతున్న ప్రచారంపై అధికారులను ప్రశ్నించారు. గతేడాదితో పోల్చితే గత రెండు నెలల్లో విద్యుత్ సరఫరా ఎక్కువగా చేసినట్లు ట్రాన్స్ కో జెన్ కో సీఎండీ రిజ్వీ సమాధానమిచ్చారు. ఇటీవల రాష్ట్రంలో మూడు సబ్ స్టేషన్ల పరిధిలో కొంత సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. దానికి కారణాలు ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సబ్ స్టేషన్లలో లోడ్ హెచ్చుతగ్గులను డీఈలు

మిగతా 2వ పేజీలో...



## రాజాసింగ్ మళ్లీ అలక

- బీజేపీఎల్పీ పదవి దక్కలేదని అంతర్మథనం
- పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఎమ్మెల్యే
- గురువు కిషన్‌జీ తీరే కారణమని ప్రచారం
- పార్లమెంట్ ఎన్నికల ముందు పార్టీకి తలనొప్పి

4లో

## ఒకటో తేదీన జీతాలు.. ఎక్కడండి..



3లో

# తెలంగాణలో నీటి పంచాయితీ

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : రాజకీయంగా కొత్త పంచాయితీ ముందుకేసుకుంది. నీళ్లతో నిప్పులు రాజేయడానికి మళ్లీ పోరు బాట పట్టనుంది గులాబీ పార్టీ. త్వరలో నీటి పోరు యాత్ర చేసేందుకు రెడీ అయింది.దక్షిణ తెలంగాణలోని నాగార్జున సాగర్, ఉత్తర తెలంగాణలోని కాళేశ్వరం నుంచి నీటి పోరు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీఆర్ఎస్ పెద్దలు ప్లాన్ చేశారు.ఇటీవలే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించడంపై నల్గొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభ సక్సెస్‌తో జోష్‌లో ఉన్న బీఆర్ఎస్ ఇదే ఊపులో

మిగతా 3వ పేజీలో...





## ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మేడారం మహా జాతరలో బ్యాటరీ కారు సేవలు



**మేడారం :** తెలంగాణ కుంభమేళా మేడారం మహా జాతరలో వృద్దులకు, దివ్యాంగులకు బ్యాటరీ కారు సేవలను రాష్ట్ర ప్రభుత్వం (దేవాదాయ శాఖ) అందుబాటులోకి తీసుకొని వచ్చింది. గురువారం జాతర ప్రాంగణంలో ఉన్న బ్యాటరీ కారు పని తీరును దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ట్రయల్ రన్ ద్వారా పరిశీలించారు. నడవలేని సీనియర్ సిటిజన్లను, దివ్యాంగులను సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం వరకు తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చేందుకు బ్యాటరీ కార్లను వినియోగించనున్నారు.

# ఇబ్రహీంపట్నంలో సమస్యలు పరిష్కరిస్తాం

## మున్సిపల్ బడ్జెట్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మల్ రెడ్డీ రంగారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి 13 కోట్ల పది లక్షల 70,000కోట్ల రూపాయలు నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించినట్టుగా తెలిపారు. 14 శాఖలకు సంబంధించిన అధికారులతో అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. రానున్న ఎండ కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీలోని పలు కాలనీలలో పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలు, వీధి లైట్లు, పరిసరాల పరిశుభ్రత, స్థానికంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి




చేస్తానని చెప్పారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో సాగర్ రహదారిపై ట్రాఫిక్ నిబంధనలను సంబంధించిన సూచనలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతంలో జరుగుతున్న గంజాయి అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేసి గంజాయిని నిర్మూలించి అరికట్టాలని తెలిపారు. గంజాయి సేవించడం వలన యువకులు మత్తుకు బానిసై అసాంఘిక కార్యక్రమాలకు , దొంగతనాలకు పాల్పడుతున్నారని, తెలియజేశారు. గంజాయి నిర్మూలనకు స్థానిక పోలీసులు ఎక్సైజ్ అధికారులు గంజాయి అమ్మకదారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహభావం పెంపొందించుకోవచ్చు




- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు . క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు . గురువారం రోజున ఆరుట్లలో వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు స్నేహభావం సోదరభావం పెరగడమే కాకుండా మానసికంగా శారీరకంగా ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఆయన అన్నారు .క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ప్రశాంతం వాతావరణం లోనిర్వహించుకోవాలని. తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు రావుల భాష ,ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ,నాయకులు గుడిమల్ల చంద్రయ్య ,మార సురేష్ ,వెదిరే రమణారెడ్డి ,ఎన్నిధుల సురేష్ ,మానిపాటి వెంకటేష్ ,కంబాలపల్లి భాస్కర్ ,దాసరమోని అశోక్ ,వెదిరె సికిందర్ రెడ్డి ,రావుల నాగరాజు ,రావుల రాఘవేందర్ ,నూకం రాయుడు ,జీలమోని శ్రీనివాస్ ,చెనమోని శంకర్ ,మంకు ప్రవీణ్, మారగొని శివ ,తదితరులు పాల్గొన్నారు.

# పెద్దల సభకు అన్నీ ఏకగ్రీవమేనా

**మొదటిపేజీ తరువాయి..**

పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆయా స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. దీంతో అసెంబ్లీలలో పార్టీలకు ఉన్న ఉన్న మెజారిటీ ఆధారంగా ఆయన స్థానాలు దక్కనున్నాయి. అయితే.. దీనికి కూడా ఎన్నికల నిర్వహణ కీలకం. అందుకే ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఇంతలోనే ఏకగ్రీవాలు తెరమీదికి వచ్చాయి. ఏకంగా 41 స్థానాల్లో నాయకులు ఏకగ్రీవమయ్యారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాతోపాటు 41 మంది అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక, బీజేపీ నుంచి 20 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి ఆరుగురు, పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురు, ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ వైఎ-స్సార్ సీపీ నుంచి ముగ్గురు, బిహార్ ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీ నుంచి ఇద్దరు, ఒడిశా అధికార పార్టీ బీజేడీ నుంచి ఇద్దరు, మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ, శివసేన పార్టీల నుంచి ఒక్కొక్కరు, తెలంగాణ ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, బిహార్ అధికార పార్టీ జేడీ యూ నుంచి ఒక్కొక్కరు ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వతేదీన కొన్ని, 3వ తేదీన కొన్ని



రాజ్యసభలో మొత్తం 56 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. 50 మంది సభ్యులు ఏప్రిల్ రెండో తేదీన, మరో ఆరుగురు మూడో తేదీన పదవీ విరమణ చేయనుండడంతో ఈ ఎన్నికలు జరపాల్సి వచ్చింది. 41 సీట్లు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 15 స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి.

# కొలువుదీరిన సమ్మక్క, సారమ్మ

**మొదటిపేజీ తరువాయి..**

ఆడబిడ్డకు మంగళహారతులు పట్టారు. అక్కడి నుంచి జంపన్న వాగు చేరుకున్నారు...వాగుపై వంతెన ఉన్నా వారి సంప్రదాయం ప్రకారం వాగులోంచే సారలమ్మను తీసుకురావడం ఆనవాయితీ. జంపన్నవాగు నుంచి బయల్దేరిన సారలమ్మకు మేడారంలో పగిడిద్దరాజు, గోవిందరాజుల వడ్డెలు ఘనస్వాగతం పలికారు. కన్నెపల్లి నుంచి మేడారానికి దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా దారికి ఇరువైపులా జనం పోటెత్తారు. శివసత్తుల పూనకాలతో జాతర మార్మోగింది. ఎదురుకోళ్లు సమర్పిస్తూ, ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ జనం సారలమ్మకు నీరాజనం పలికారు. సారలమ్మ మేడారం గుడిలోకి చేరగానే ఆదివాసీ సంప్రదాయ విన్యాసాలతో డోలి మోతలు, కొమ్ము బూరల నాదాలతో దద్దరిల్లాయి. పూజలు నిర్వహించిన అనంతరం సారక్కను మేడారం గద్దెపై ప్రతిష్టించారు. మహాజారతలో రెండోరోజు ఫిబ్రవరి 22న సమ్మక్క తల్లి సాయంత్రం గద్దెపైకి వచ్చింది. మొదటగా గిరిజన పూజారులు మేడారం సమీపంలోని చిలుకల గుట్టకు వెళ్ళి వెదురు కర్రలు తీసుకొచ్చి గద్దెలపై పెట్టి పూజిస్తారు. ఆ తర్వాత సమ్మక్క పూజా మందిరం నుంచి పసిడి కుండలను తెచ్చి గద్దెలపై నెలకొల్పుతారు. తర్వాత మళ్ళీ చిలుకల గుట్టకు వెళ్తారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చే మహాఘట్టం మొదలవుతుంది. తల్లి రూపాన్ని చేతపట్టుకున్న మరుక్షణమే ప్రధాన వడ్డె తన్మయత్వంతో పరుగు పరుగున గుట్ట దిగుతాడు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తుపాకీతో గాల్లోకి



కాల్పులు జరిపి వనదేవతకు ఆహ్వానం పలుకుతారు. సమ్మక్క రాకతో మేడారం మొత్తం శివసత్తుల పూనకాలతో హోరెత్తి ఊగిపోతుంది. దారి పొడవునా భక్తుల జన ప్రవాహం సాగుతుంది..అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా జంతు బలులు ప్రారంభమవుతాయి. కుంకుమ భరణిని గద్దెలపైకి చేర్చిన తర్వాత మహా జాతర లాంఛనంగా ప్రారంభమవుతుంది. జాతర సందర్భంగా ఆర్టీసీ బస్సులు అమ్మవార్ల గద్దెలకు అతి సమీపంలోకి వెళ్తాయని, భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా వనదేవతలను దర్శించుకోవాలని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కోరారు. అధికారులంతా ఎప్పటికప్పుడు ఏర్పాట్లు దగ్గరుండి పరిశీలిస్తున్నారు. మరోవైపు మేడారం మహాజాతరపై ప్రధాని నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా తెలుగులో ట్వీట్ చేశారు. గిరిజనుల అతిపెద్ద పండుగల్లో ఒకటైన, మన సాంస్కృతిక వారసత్వానికి చిరకాల స్ఫూర్తిగా నిలిచే చైతన్యవంతమైన వ్యక్తీకరణ అయిన ఈ జాతర ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు అంటూ పోస్ట్ చేశారు.

# కరెంట్ కట్ చేస్తే.. సస్పెండ్

**మొదటిపేజీ తరువాయి..**

సరి చూసుకుంటూ ఉండాలని, అలా చూసుకోకపోవడంతో సమస్య తలెత్తిందని అధికారులు తెలియజేశారు. అలా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏవైనా మరమ్మతులు, ఇతర అంశాలకు సరఫరా నిలిపివేయాల్సి వస్తే ముందుగానే ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అత్యుత్సాహంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఉద్దేశ్యపూర్వకంగా కోతలు పెడుతున్నారనే సమాచారం తమకు ఉందని సీఎం హెచ్చరించారు. ఎక్కడైనా అయిదు నిమిషాలకు మించి విద్యుత్ సరఫరా నిలిచిపోతే అందుకు గల కారణాలపై వెంటనే సమీక్షించుకోవాలని చెప్పారు. సాంకేతిక, ప్రకృతిపరమైన కారణాలు మినహా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కోతలకు కారణమైతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో డిమాండ్ కు అనుగుణంగా సరిపడేంత విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ పీక్ సీజన్కు సరిపడేంత విద్యుత్తును అందించే కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకుంది. ఫిబ్రవరిలో ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు రోజుకు 264.95 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయింది. గత ఏడాది అదే వ్యవధిలో 242.44 మిలియన్ యూనిట్లు మాత్రమే సరఫరా జరిగింది. నిరుడు జనవరిలో 230.54 మిలియన్ యూనిట్లు సరఫరా కాగా, ఈ ఏడాది జనవరిలో అంతకంటే ఎక్కువగా 243.12 మిలియన్ యూనిట్లు సరఫరా అయింది.



# అవి పాతరేనా..?

**మొదటిపేజీ తరువాయి..**

నెలలో టీఎస్ పీఎస్ సీ గ్రూప్ -1 కు ప్రాథమిక పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు రెండు లక్షల 80 వేల మంది హాజరయ్యారు. ప్రాథమిక పరీక్షకు సంబంధించి ఫలితాలు విడుదలైనప్పటికీ.. ప్రశ్న పత్రం లీక్ కారణంగా గ్రూప్ - 1 ప్రాథమిక పరీక్ష రద్దు చేస్తున్నట్టు బోర్డు ప్రకటించింది. దీంతో మళ్లీ అదే ఏడాది జూన్ నెలలో గ్రూప్ -1 ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. అప్పట్లో పలువురు అభ్యర్థులు హై కోర్టును ఆశ్రయించారు. అభ్యర్థుల వాదనతో ఏకీభవించిన హైకోర్టు పరీక్ష నిర్వహణలో నిబంధనలు పాటించలేదని, లోపాలు దారుణంగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేసింది.. పరీక్ష రద్దు చేయాలని బోర్డును ఆదేశించింది.. అప్పుడు భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉండటంతో టీఎస్ పీఎస్ సీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈలోపు ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడంతో.. గతంలో టీఎస్ పీఎస్ సీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఎన్నికలకు ముందు చెప్పినట్టుగానే పాత నోటిఫికేషన్ రద్దు చేసి.. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది.గత ప్రకటనలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా.. ప్రస్తుత నోటిఫికేషన్ లో దరఖాస్తు చేసుకోవాలని టీఎస్ పీఎస్ సీ( ప్రకటించింది. గతంలో ఫీజు చెల్లించిన వారు.. ఇప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదని.. నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు మాత్రమే ఫీజు చెల్లించాలని సూచించిందిఇక తాజా ప్రకటనలో ప్రభుత్వం 563 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14 వరకు టీఎస్ పీఎస్ సీఅధికారిక వెబ్ సైట్ లో మాత్రమే



దరఖాస్తు చేసుకోవాలి. మార్చి 23 నుంచి 27 వరకు దరఖాస్తు ఎడిట్ చేసుకునే సౌలభ్యం ఉంది. మే లేదా జూన్ నెలలో ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాల వెల్లడి అనంతరం సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో తుది పరీక్ష నిర్వహిస్తారు. ప్రాథమిక పరీక్షకు వారం రోజుల ముందు హాల్ టికెట్లు అందుబాటులో ఉంచుతారు.గ్రూప్ - 1 కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని ప్రభుత్వం పెంచింది. వయోపరిమితిని 44 నుంచి 46 సంవత్సరాలకు పెంచింది. ఇక సామాజిక వర్గాల ప్రకారం కూడా వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఎన్నికలకు ముందు వయోపరిమితి సడలింపు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో టీఎస్ పీఎస్ సీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. మరోవైపు ఇటీవల బడ్జెట్ లో కూడా టీఎస్ పీఎస్ సీకి ప్రభుత్వం భారీగానే నిధులు కేటాయించింది. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను పునరావృతం చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుదిట్టంగా ఉద్యోగాల భర్తీలో అడుగులు వేస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# ఒకటో తేదీన జీతాలు.. ఎక్కడండి..

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి.. 22 రోజులు గడుస్తున్నా జీతాలు రాక అంగన్వాడీలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. 'ఉద్యోగులు నెలంతా పని చేసి జీతం కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సమగ్ర శిక్ష, కేజీబీవీ సిబ్బందికి జీతాలు చెల్లించాలి.' అని ట్విట్టర్ వేదికగా డిమాండ్ చేశారు. అలాగే, సన్ ఫ్లవర్ పండించిన రైతులు మద్దతు ధర రాకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి ట్విట్టర్ వేదికగా హరీష్ రావు తీసుకొచ్చారు. 'ఈ ఏడాది మద్దతు ధర రూ.6,760 ఉండగా మార్కెట్ లో మాత్రం రూ.4 వేల నుంచి రూ.5 వేలకే రైతులు అమ్ముకుంటున్నారు. ప్రతి క్వింటాలుకు దాదాపు రూ.2 వేలు నష్టపోతున్నారు. గతంలో మా ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో మద్దతు ధరకు రైతుల నుంచి సన్ ఫ్లవర్ కొని రైతులను ఆదుకున్నాం. మీరు వెంటనే అధికారులను ఆదేశించి రాష్ట్ర వ్యాప్తంగా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరకు సన్ ఫ్లవర్ కొని రైతుల ప్రయోజనాలు కాపాడాలని కోరుతున్నాను.' అంటూ ట్వీట్ లో పేర్కొన్నారు. మరోవైపు, సిద్ధిపేట సబ్ స్టేషన్ లో జరిగిన అగ్ని ప్రమాదం విషయంలో సైతం బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య విమర్శ, ప్రతి విమర్శలు సాగాయి. ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు పేలటంతో.. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఒక దాని తర్వాత ఒకటి పేలుతుండటంతో.. భారీ ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. ట్రాన్స్ ఫార్మర్లు పేలిన శబ్దాలతో చుట్టుపక్కల స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ అగ్నిప్రమాదంతో.. సిద్ధిపేట మొత్తం విద్యుత్ నిలిచిపోవడంతో పట్టణమంతా అంధకారం అలుముకుంది. అయితే ఈ ఘటనకు రాజకీయం రంగు పులుముకుంది.

# అభివృద్ధి పనుల్లో సర్కారు నిర్లక్ష్యం

**మాజీ మంత్రి తలసాని**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం సనత్ నగర్ లో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాలి. అభివృద్ధి పనులు చేపట్టాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు మంజూరు చేసింది. గడిచిన 10 సంవత్సరాలలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నడూ జరగనన్ని అభివృద్ధి పనులు చేశాం. నెల రోజుల పాటు వేచి చూస్తాం...తర్వాత కార్యాచరణతో ప్రజా క్షేత్రంలోకి వెళ్ళి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకోస్తామని అన్నారు.



# హిట్ అండ్ రన్ కేసు




**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ లో ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట హిట్ అండ్ రన్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా, గురువారం ఉదయం బొల్లారం పరిధిలోని ఓ ప్రమాదం జరిగింది. ఓ వైద్యుడు కారును వేగంగా నడుపుతూ వచ్చి తోపుడు బండ్లపైకి దూసుకెళ్లాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అతని కారును వెంబడించి పట్టుకున్నారు. ఆయన నగరంలో ఓ ఆస్పత్రికి చెందిన న్యూరో సర్జన్ అని తెలుస్తోంది. కాగా, ఈ ప్రమాదంలో సయ్యద్ షాషా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. తన ఆస్పత్రిలోనే బాధితునికి చికిత్స అందిస్తానని చెప్పి కారులో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అత్తాపూర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి అక్కడి నుంచి వైద్యుడు పరారయ్యాడు.

# 10 సీట్లపై ఎంఐఎం గురి




09
హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
లోక్‌సభ ఎన్నికల రాజకీయ ఉత్కంఠతో ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ రంగంలోకి దిగారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంఐఎంకు చెందిన ఇద్దరు ఎంపీలు విజయం సాధించగా, అసదుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ నుంచి, ఇంతియాజ్ జలీల్ ఔరంగాబాద్ నుంచి గెలుపొందారు. ఈసారి రెండు సీట్లకు పైగా గెలుపొందాలని ఒవైసీ ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకోసం ఓ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకున్నారట. హైదరాబాద్, ఔరంగాబాద్‌లతో పాటు ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్న ఒవైసీ.. అభ్యర్థుల ఎంపిక పనిలో బిజీగా ఉన్నారట. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అసదుద్దీన్ ఒవైసీ తన పర్యటనను ప్రారంభించారు. మహారాష్ట్ర నుంచి బీహార్‌లోని సీమాంచల్ వరకు రాజకీయ సమీకరణాలను పరిష్కరించడంలో ఒవైసీ బిజీగా ఉన్నారు. ఇటీవల, అసదుద్దీన్ ఒవైసీ సీమాంచల్‌లో పర్యటించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో వీలైనన్ని ఎక్కువ పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని యోచిస్తున్నామని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలో ఒకే ఒక స్థానంలో పోటీ చేసామని, అది కిషన్‌గంజ్ స్థానం నుంచే మాత్రమే అన్నారు. అయితే ఈసారి కిషన్‌గంజ్‌లో కాకుండా మరో మూడు స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాలని ప్లాన్ చేస్తున్నామని ఒవైసీ ప్రకటించారు. 2024 ఎన్నికల్లో బీహార్‌లోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని ఒవైసీ యోచిస్తున్నారట. సీమాంచల్ ప్రాంతంలోని పూర్ణియా, అరారియా, కిషన్‌గంజ్, కతిహార్ లోక్‌సభ స్థానాలపై ఒవైసీ కన్నేశారు. ఇక్కడ తన అభ్యర్థులను నిలబెట్టాలని ప్లాన్ చేశారు. ఈ నాలుగు ముస్లిం ప్రాబల్యం ఉన్న స్థానాలు. ఇక్కడ 30 నుండి 60 శాతం ముస్లిం ఓటర్లు ఉన్నారు. 2019లో ఒవైసీ పార్టీ నుంచి అక్తర్-ఒల్ ఇమాన్ కిషన్‌గంజ్ నుంచి పోటీ చేసి రెండు లక్షల ఓట్లతో విజయం సాధించారు. ఈ సీటులో కాంగ్రెస్ విజయం సాధించగా, జేడీయూ రెండు సీట్లు, బీజేపీ ఒక సీటు గెలుచుకున్నాయి. అప్పటి నుండి, సీమాంచల్ ప్రాంతంలో ఒవైసీ గ్రాఫ్ పెరిగింది. దాని కారణంగా అతను 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు స్థానాల్లో ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే నలుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి ఆర్జేడీలో చేరారు. భారత్ జోడో న్యాయ యాత్ర పేరుతో ముస్లిం వర్గాల్లో తన ఉనికిని చాటుకునేందుకు రాహుల్ గాంధీ సీమాంచల్‌కు వచ్చి ఆ తర్వాత ఒవైసీ మూడు రోజుల పాటు క్యాంపు వేశారు. బీహార్‌తో పాటు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల లోక్ సభ ఎన్నికల్లో కూడా పోటీ చేయాలని ఒవైసీ భావిస్తున్నారట. జార్ఖండ్‌కు చెందిన పార్టీ నేతల బృందాన్ని కూడా కలిశానని ఒవైసీ చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో గిరిజన రాష్ట్రంలోని రెండు మూడు స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టాలని పరిశీలిస్తున్నామన్నారు. ఇక్కడ గిరిజన, ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు ముస్లిం ప్రాబల్య స్థానాల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఒవైసీ వ్యూహరచన చేస్తున్నారట. కిషన్‌గంజ్‌లో జరిగిన ర్యాలీలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని సీమాంచల్‌కు ఆనుకుని 30 శాతానికి పైగా ముస్లిం ఓటర్లు ఉన్న స్థానాలపై ఒవైసీ కన్నేశారు. మహారాష్ట్రలోని 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఔరంగాబాద్ స్థానాన్ని గెలుచుకున్న ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ముంబై లోక్‌సభ నియోజకవర్గంలోకి ప్రవేశించాలని ఆలోచిస్తోంది. మహారాష్ట్ర నుంచి తన ఏకైక ఎంపీని రాజధాని సీటు నుంచి పోటీకి దింపాలని ఒవైసీ ఆలోచిస్తున్నారట. మహారాష్ట్రలోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించాలని అసదుద్దీన్ ఒవైసీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నుంచి పోటీ చేయాలన్న ఎంపీ ఇంతియాజ్ జలీల్ ప్రతిపాదనను తమ పార్టీ పరిశీలిస్తుందని చెప్పారు. మహారాష్ట్రలోని నాలుగు లోక్‌సభ స్థానాలైన ధులే, నాందేడ్, భివాండి, ఛత్రపతి సంభాజీనగర్ స్థానాల్లో ఎంఐఎం తన అభ్యర్థులను నిలబెట్టాలని భావిస్తోంది. ఇందులో ఛత్రపతి సంభాజీనగర్ సీటు (గతంలో ఔరంగాబాద్) ప్రస్తుతం ఎఐఎంఐఎం చేతిలోనే ఉందిమహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఒవైసీ.. సెక్యులర్‌గా చెప్పుకునే రాజకీయ పార్టీలు రాష్ట్రంలో అశాంతిలో ఉన్నాయని అన్నారు. దీంతో పాటు, ఇటీవల బీజేపీ దాని కూటమి భాగస్వాములలో చేరిన ప్రతిపక్ష శిబిరానికి చెందిన నాయకులను ఆయన ఘాటుగా విమర్శించారు. ఆరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని ఇంతియాజ్ జలీల్ నుంచి పార్టీకి ప్రతిపాదన వచ్చిందని చెప్పారు. దీనిపై పార్టీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. అయితే, ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్న నాలుగు లోక్‌సభ స్థానాలపై పార్టీ కన్నేసిందిఎఐఎంఐఎం ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు షౌకత్ అలీ 2024లో 20 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రతిపాదన పంపారు. అంబేద్కర్ నగర్, శ్రావస్తి, ఘోసీ, జౌన్‌పూర్, పశ్చిమ యూపీలోని సుల్తాన్‌పూర్, మొరాదాబాద్, సంభాల్, అమ్రోహా, సహరాన్‌పూర్, మీరట్, పూర్వాంచల్ రీజియన్ స్థానాల్లో పోటీ చేయాలని ప్రతిపాదన పంపారు. ఫిబ్రవరి నెలాఖరులో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో షౌకత్ అలీ భేటీ అవుతారని, ఇందులో యూపీలో పోటీ చేసే సీట్ల సంఖ్య, ఆయన పర్యటన ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై చర్చించనున్నారు. అయితే, యూపీకి చెందిన ఎఐఎంఐఎం కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రతిపాదన పంపిన లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభించింది. ఇది కాకుండా మార్చిలో యూపీలో నాలుగు బహిరంగ సభ్యలు నిర్వహించాలని ఒవైసీ యోచిస్తున్నారు.

# తెలంగాణలో నీటి పంచాయితీ

మొదటిపేజీ తరువాయి..

నీటి పోరు యాత్ర చేసి తమ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కారు పార్టీ డిసైడైనట్లు కనిపిస్తోంది. తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఎన్నికల వేళ మరోసారి ప్రజలకు గుర్తుచేసేందుకే ఈ యాత్ర అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే, స్వతంత్ర్య భారతవనీలో కనువినీ ఎరుగని జలదోపిడి. నీటి పేరుతో నోట్ల కట్టలను వెనకేసుకున్నారంటూ ఇటీవల శాసనసభ సాక్షిగా ప్రస్తుత ప్రభుత్వం. గత ప్రభుత్వంపై విరుచుకుపడింది. అసలే మేడిగడ్డ పేకమైడైందని.. సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లు కూడా డేంజర్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మరి తాతలనాటి ప్రాజెక్టులు తాపీగా నిలబడ్డా.. ఇప్పటి ప్రాజెక్టులెందుకు కుంగిపోతున్నాయి. ఈ కుంగుబాటుకు కారణం మీరంటే మీరంటూ అసెంబ్లీలో అధికార విపక్షాల మధ్యవాదోపవాదాలు తారాస్థాయిలో జరిగాయి. ఇంతకూ ప్రాజెక్టుల పంచాయితీలో ఎవరి వాదనలో వాసవముంది..? నీటి వాటాలపై ఏపీ, తెలంగాణ మధ్య యుద్ధం ఎప్పటి నుంచో జరుగుతున్న ముచ్చట. లేటెస్ట్‌గా తెలంగాణలోనే అధికార, విపక్షాల మధ్య వార్ మొదలైంది. తప్పు నీదంటే నీదంటే ఇరు వర్గాలు వాదించుకుంటున్నాయి. అదే సమయంలో తమపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతోంది ఏపీ. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల విషయంలో అన్యాయం జరిగింది. ఆ అన్యాయానికి బీఆర్ఎస్సే కారణం అని కాంగ్రెస్ అరోపిస్తోంది. అయితే కాంగ్రెస్ వల్లే రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆరోపిస్తోంది గులాబీ పార్టీ. ఇదే అంశంపై అటు అసెంబ్లీలో.. ఇటు మేడిగడ్డ గట్టు మీద నుంచి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది అధికార పార్టీ. ఇక నల్గొండ వేదికగా కాంగ్రెస్ పార్టీపై గర్జించారు మాజీ సీఎం కేసీఆర్. మొత్తంగా అటు కేఆర్ఎంబీ, ఇటు కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో రాజకీయం భగ్గుమంటోంది. ఈ వివాదం ఎంతవరకూ వెళ్తుందో.. ఎక్కడ ఎండ్ కార్డ్ పడుతుందో చూడాలి మరి.



# ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ బోర్డు పరీక్షల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు సీఎస్ శాంతికుమారి తెలిపారు. ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధితశాఖల అధికారులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి సుమారు 9.80 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 1521 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ఆయా కేంద్రాల్లో ఉన్నతాధికారులతో సహా ఏ ఉద్యోగి సైతం సెల్‌ఫోన్ తీసుకెళ్లకుండా నిషేధం విధించినట్లు స్పష్టం చేశారుక్వశ్చన్ పేపర్లను స్ట్రాంగ్ రూమ్‌లకు, మూల్యాంకన కేంద్రాలను తీసుకెళ్లే సమయంలో పటిష్టమైన బందోబస్తు ఉండాలని సీఎస్ ఆదేశించారు. మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని తెలిపారు. 5.8 లక్షల మంది విద్యార్థులు హాజరవనుండగా.. 2,676 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు శాంతి కుమారి పేర్కొన్నారు.

**ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు..**

- **ఫిబ్రవరి 28 :** సెకండ్ లాంగ్వేజ్ పేపర్-ఎ
- **మార్చి 01 :** ఇంగ్లిష్ పేపర్-ఎ
- **మార్చి 04 :** మ్యాథమెటిక్స్ పేపర్-ఎం, బాటనీ పేపర్-ఎ, పొలిటికల్ సైన్స్ పేపర్-ఎ
- **మార్చి 06 :** మ్యాథమేటిక్స్ పేపర్-ఎః, జువాలజీ పేపర్-ఎ, హిస్టరీ పేపర్-ఎ
- **మార్చి 11 :** ఫిజిక్స్ పేపర్-ఎ, ఎకనామిక్స్ పేపర్-ఎ
- **మార్చి 13 :** కెమిస్ట్రీ పేపర్-ఎ, కామర్స్ పేపర్-ఎ
- **మార్చి 15 :** పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-ఎ, బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్ పేపర్-ఎ
- **మార్చి 18 :** మోడర్న్ లాంగ్వేజ్ పేపర్-ఎ, జియోగ్రఫీ పేపర్-ఎ

**ఇంటర్ సెకండ్ పరీక్షలు..**

- **ఫిబ్రవరి 29 :** సెకండ్ లాంగ్వేజ్ పేపర్-ఎఎ
- **మార్చి 02 :** ఇంగ్లిష్ పేపర్-ఎఎ
- **మార్చి 05 :** మ్యాథమెటిక్స్ పేపర్-ఎఎం, బాటనీ పేపర్-ఎఎ, పొలిటికల్ సైన్స్ పేపర్-ఎఎ
- **మార్చి 07 :** మ్యాథమెటిక్స్ పేపర్-ఎఎః, జువాలజీ పేపర్-ఎఎ, హిస్టరీ పేపర్-ఎఎ
- **మార్చి 12 :** ఫిజిక్స్ పేపర్-ఎఎ, ఎకనామిక్స్ పేపర్-ఎఎ
- **మార్చి 14 :** కెమిస్ట్రీ పేపర్-ఎఎ, కామర్స్ పేపర్-ఎఎ
- **మార్చి 16 :** పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-ఎఎ, బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్ పేపర్-ఎఎ
- **మార్చి 19 :** మోడర్న్ లాంగ్వేజ్ పేపర్-ఎఎ, జియోగ్రఫీ పేపర్-ఎఎ

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి సీనియర్లు

- **ఎమ్మెల్యే సబితా అనుచరగణం ఆరాచకాలపై ఆవేదన**
- **కష్టకాలంలో పార్టీని కేఎల్ఆర్ నిలబెట్టారు- కాంగ్రెస్ నేతలు**
- **సొంతగూటికి సీనియర్లు రావటం సంతోషం- కేఎల్ఆర్**

**రంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :** కందుకూర్ మండలం జైత్వారం, బాచుపల్లి గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు బీఆర్ఎస్ నాయకులు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.. తుక్కుగూడ నివాసంలో కండువాలు కప్పుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో హస్తం పార్టీని ముక్కలుగా చేసి... కారెక్కిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పార్టీ సీనియర్ నాయకులు మండిపడ్డారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కేఎల్ఆర్ పోటీ చేసి క్యాడర్ ను నిలబెట్టారని గుర్తుచేశారు.



ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... గతంలో బీఆర్ఎస్, బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మళ్లీ తిరిగి సొంతగూటికి రావటం సంతోషం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రోజూ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రీవెన్స్ కోసం వచ్చే బాధితుల్లో ఎక్కువ మంది సబితమ్మ అనుచరగణం బాధితులే ఉన్నారని చెప్పారు. సమస్యలను పరిష్కరించకుండా చిక్కుముడులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేఎల్ఆర్ మండిపడ్డారు. బాచుపల్లి నుంచి వెంకటేశ్, జైత్వారం నుంచి మహేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని కేఎల్ఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణానాయక్, జంగారెడ్డి, సత్యనారాయణ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మేడారంకు జాతీయ హోదా ఇవ్వలేం..!

మొదటిపేజీ తరువాయి..

ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ ఆధ్వర్యంలో గిరిజన వర్సిటీ పని చేస్తుందని తెలిపారు. మేడారం జాతరను జాతీయ పండుగగా నిర్వహించాలని చాలా మంది అడుగుతున్నారు. జాతీయ పండుగ విధానం అనేది ఎక్కడా లేదన్నారు. మేడారానికి అంతర్జాతీయ గుర్తింపు కోసం రాబోయే రోజుల్లో ప్రయత్నిస్తామన్నారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## జాతర లో ప్రత్యేక ఆకర్షణగా కోయ దొరలు



మేడారం, ప్రభాతసూర్యుడు : మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర కు దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు.జాతర సందర్భంగా మేడారం పరిసరాలు జన సందోహం తో నిండిపోయాయి. కోట్లాది మంది భక్తులు కొంగు బంగారం అయిన సమ్మక్క సారలమ్మ జాతర లో కోయ దొరలు ప్రత్యేక ఆకర్షణగా లుస్తున్నారు.దట్టమైన అడవులలో దొరికే అనేక రకాల వనమూలికల మొక్కలు ,వేర్లు,చెట్ల కొమ్మలను తీసుకు వచ్చి జాతరకు వచ్చే భక్తులకు విక్రయిస్తున్నారు..తాము ఆదివాసిలం అని అడవులలో జీవిస్తూ సమ్మక్క సారలమ్మల ఉపవాస దీక్ష చేపట్టి నిష్ఠతో పూజలు నిర్వహించి అన్ని రోగాలకు సంబంధించిన మూలికలను తమ పూర్వీకుల నుండి తెలుసుకొని నేటికీ అదే కొనసాగిస్తూ ఎంతో మంది ప్రజలకు నయం చేసినట్లు చెబుతున్నారు.భక్తుల నమ్మకానికి అనుగుణంగా వారి వారి రోగాలు నయం అవుతాయని కోయ దొరలు జ్యోతిష్యం తో వారి జాతకం నిజమవుతుందనీ కొందరు భక్తులు తెలిపారు.

# సంపాదకీయమ్..

## ఫ్రీ హామీలనే నమ్ముకున్న తెలుగు రాష్ట్రాలు

ఎన్నికల కోసం ఎడాపెడా హామీలు ఇచ్చి.. ఆ తర్వాత వాటిని అమలు చేయాలంటే ఎంత ఇబ్బంది అవుతుందో.. ఆర్థికంగా ఎంత ఒత్తిడి ఎదురవుతుందో? కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 రాష్ట్ర బడ్జెట్ కళ్లకు కట్టినట్లు వెల్లడి చేస్తోంది. మూడు లక్షల 71 వేల కోట్ల రూపాయల వ్యయంతో కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కోసం నిధుల సమీకరణలో భాగంగా దాదాపు లక్షా ఐదు వేల కోట్ల రూపాయలను అప్పుల రూపేణా సమీకరించుకోవాల్సిన పరిస్థితి కర్నాటక రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురయ్యింది. అంటే బడ్జెట్‌లో 28% మొత్తాన్ని అప్పు చేసి తెచ్చుకోవాల్సి వచ్చింది.కర్నాటక ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు లక్షా 20 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో లక్షా 5 వేల కోట్ల రూపాయలను అప్పుగా తేవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో సంక్షేమ పథకాల అమలు ఎంత కష్టతరం కాబోతోందో ఇట్టే అర్థం అవుతోంది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే 4 లక్షల 35 వేల కోట్ల రూపాయల అప్పు ఉంది. దీనికి కొత్తగా తీసుకు రానున్న అప్పులు అదనం. ఈ ఏడాదికి ఏదో విధంగా అప్పులు తీసుకు రాగలిగినా, వచ్చే సంవత్సరాల్లో ఇది సాధ్యం అవుతుందా అనే ప్రశ్న ఉత్పన్నం కాకమానదు.కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరంలో 44 వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చే సరికి అప్పుగా తెచ్చిన మొత్తం 85 వేల కోట్ల రూపాయలుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను లక్షా 5 వేల కోట్ల రూపాయల అప్పు తీసుకురానున్నారు. ఇలా ప్రతి ఏటా తీసుకురావాల్సిన అప్పులు పెరిగిపోతుంటే? అప్పు పుట్టే పరిస్థితి ఉంటుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.గడచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా? కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఎడాపెడా హామీలు ఇచ్చిందని, తెలంగాణలోనూ ఇదే ఒరవడి కొనసాగించారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ అక్కడ కూడా ఎడాపెడా హామీలు గుప్పించనున్నారనే విస్తృత చర్చ జరుగుతున్న సందర్భంలో.. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయడం మున్ముందు ఇబ్బందికరంగా మారనుందనే చర్చ ఇప్పటికే మొదలయ్యింది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయితే.. మరో అడుగు ముందుకు వేసి ఎన్నికల హామీలపై కొత్త చర్చకు తెరదీశారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను ఇప్పుడు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం ఏటా దాదాపు 53 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని.. ఈ నిధులు సమీకరించుకోవాలంటేనే తలప్రాణం.. తోకలోకి వస్తోందని జగన్మోహన్‌రెడ్డి బహిరంగంగానే చెప్పారు.ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు కొత్తగా చెబుతున్న వాగ్దానాలను అమలు చేయాలంటే ఏటా మరో 73 వేల కోట్ల రూపాయలు కావాలని, అంటే ఇప్పటికే ఉన్న వాటికి తోడు? కొత్తవి అమలు చేయడానికి ఏడాదికి మొత్తం లక్షా 26 వేల కోట్ల రూపాయలు కావాలని, వీటిని ఎక్కడి నుంచి తెస్తారని జగన్ సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే 7 లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పు ఉన్న నేపథ్యంలో.. జగన్ లేవనెత్తుతున్న ప్రశ్న కొత్త చర్చకు దారితీస్తోంది.ఎన్నికల సందర్భంగా ఎడాపెడా హామీలు ఇచ్చుకుంటూ పోతే? వాటిని అమలు చేయడానికి నిధులు ఎలా ? అప్పులతో ఎంతకాలం నిధులు సమీకరించగలుగుతారు ? హామీలు తలకు మించిన భారంగా మారి చివరకు చేతులెత్తేయాల్సిన పరిస్థితి రాదా ? అదే జరిగితే.. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి రియాక్షన్ ఎలా ఉంటుంది ? దీనికి ముగింపు ఎలా ఉండనుంది ? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అందుకే కర్ణాటక రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన అప్పుల సమీకరణ అంశం మిగిలి రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించేలా ఉంది.ఏటేటా చేస్తున్న అప్పుల విషయానికి వస్తే? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి దాదాపు 77 వేల కోట్ల రూపాయల అప్పులు చేయగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 86 వేల 612 వేల కోట్ల రూపాయల అప్పులు తేవాల్సి ఉంటుందని అంచనా వేశారు. తెలంగాణ ప్రభుత్వం విషయానికి వస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు 43 వేల 115 కోట్ల రూపాయల అప్పులు తీసుకురాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 64 వేల 525 కోట్ల రూపాయల అప్పు తీసుకురావాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ రాష్ట్రాలు రెండూ ఇప్పటికే భారీగా పేరుకుపోయిన అప్పులతో సతమతమవుతున్నాయి. రానున్న సంవత్సరాల్లో ఈ అప్పుల భారం పెరిగిపోయి? కొత్త అప్పులు పుట్టడం రాష్ట్ర ప్రభుత్వాలకు కష్టమవుతుందనే అభిప్రాయం ఉంది. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం వచ్చే పార్లమెంట్ ఎన్నికల అనంతరం? ఆర్థిక క్రమశిక్షణ కోసం కొత్త నిబంధనలు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే.. రాష్ట్ర ప్రభుత్వాలకు నిధుల పరంగా ఎదురయ్యే పరిస్థితిని ఊహించుకోవడమే కష్టంగా ఉంటుంది.అందుకే? తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల హామీల విషయంలో కనుక రాజకీయ పార్టీలు నేల విడిచి సాము చేస్తే? ఆర్థిక ఇబ్బందులు భరించలేని స్థాయికి వస్తాయన్నది సుస్పష్టం.

# తెలంగాణలో కమలం దూకుడు



నిజామాబాద్, ప్రభాతసూర్యుడు : లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలంగాణ బీజేపీ పార్టీ దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల గెలుపు జోష్ తో పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. మొత్తం 17 ఎంపీ సీట్లలో సగానికిపైగా సగం సీట్లు దక్కించుకోవాలని వ్యూహరచన చేస్తోంది. అయితే 10 రోజుల పాటు సాగే విజయ సంకల్ప్ యాత్రతో తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఇప్పటికే లోక్ సభ ఎన్నికల కోసం మొదటి దశ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ యాత్రను నాలుగు వేర్వేరు ప్రాంతాలకు చెందిన పార్టీ సీనియర్ నేతలు ఒకేసారి జెండా ఊపి ప్రారంభించారు.అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ బిజెపి పార్లమెంటు బోర్డు సభ్యుడు కె లక్ష్మణ్ తో కలిసి బాసర ఆలయం వద్ద కొమరం భీమ్ క్లస్టర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 24న హైదరాబాద్ లో జరిగే విజయ్ సంకల్ప్ యాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొంటారని తెలిపారు. మార్చి 1న యాత్ర ముగుస్తుందని సుభాష్ తెలిపారు. తొలి దశ ప్రచారం ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి బహిరంగ సభలో ప్రసంగిస్తారని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే తేదీ, స్థలం ఇంకా ఖరారు కాలేదని పేర్కొన్నారు.కాగా పార్టీ విజయ సంకల్ప యాత్రకు ముందు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకోవడంలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) చేతులు కలిపాయని, 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వంలో బీఆర్ఎస్ భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు. 2జీ, బొగ్గు కుంభకోణాల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కాంగ్రెస్ ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉంది. రెండు పార్టీలు ఒకే నాణేనికి రెండు వైపులని ఆయన అన్నారు. మరోవైపు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ తాండూరులోని రాజ రాజేశ్వరి క్లస్టర్ నుంచి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. గత పదేళ్లుగా మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని, దేశం ఐక్యంగా, శాంతియుతంగా, సుభిక్షంగా ఉండేలా చూశారన్నారు.అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ 8 స్థానాలు దక్కించుకుంది. అయితే ఈ క్రమంలో పార్టీ కీలక నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్, రఘునందన్ లాంటి నేతలు అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. వీరితోపాటు మరికొంతమంది నేతలు ఓటమిని చవి చూశారు. అయితే వీళ్లంతా లోక్ సభ బరిలో నిలిచేందుకు పావులు కదుపుతుండటం గమనార్హం.

## రాజాసింగ్ మళ్లీ అలక



- బీజేపీఎల్పీ పదవి దక్కలేదని అంతర్మథనం
- పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఎమ్మెల్యే
- గురువు కిషన్‌జీ తీరే కారణమని ప్రచారం
- పార్లమెంట్ ఎన్నికల ముందు పార్టీకి తలనొప్పి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలంగాణ బీజేపీకి కొత్త చిక్కులు ఎదురయ్యారు. ఆ పార్టీ సీనియర్ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి అలకబూనారు. బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రథయాత్ర ప్రారంభోత్సవానికి సైతం ఆయన దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీ కమలం వాణిని వినిపించిన ఏకైక ఎమ్మెల్యే అయిన తనకు ఈసారి బీజేపీఎల్పీ టీంలో చోటు కల్పించకపోవడంతో ఆయన మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు టిక్కెట్ రాలేదని నేతల అలకలు, బుజ్జగింపులు షరామాములే కానీ.. లోక్ సభ ఎన్నికల ముందు బీజేపీ ఎమ్మెల్యే అలకపాన్పు ఎక్కడం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. తెలంగాణ బీజేపీ సీనియర్ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ అధిష్టానంపై అలకబూనారు. తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ చేపట్టిన రథయాత్ర వాహనాలకు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొనలేదు. అలాగే భువనగిరి బహిరంగ సభకు కూడా హాజరుకాలేదు. బీజేపీ ఎల్పీ పదవి దక్కలేకపోవడంతో ఆయన మనస్తాపానికి గురయినట్లు సమాచారం. దీంతో పార్టీకి, రాజాసింగ్‌కి మధ్య గ్యాప్ మరింత పెరిగింది. గోషామహల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. గత ప్రభుత్వ హయాంలో బీజేపీ తరపును ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ మాత్రమే. దీంతో సభలోనూ, బయట ఆయన పార్టీకోసం గళమెత్తారు. దూకుడుగా వ్యవహరించి మంచి పేరు తెచ్చుకున్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో బీజేపీ 8చోట్ల గెలుపొందింది. పార్టీ సీనియర్ నేతగా, గోషామహల్ నుంచి వరుసగా మూడసార్లు గెలుపొందిన తననే బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారని రాజాసింగ్ భావించారు. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిమాత్రం ఈ వ్యవహారాన్ని ఇంకా తేల్చకుండా నాన్చడం తో రాజాసింగ్ అసంతృప్తితో ఉన్నారు. పార్టీ నాయకత్వం తీరుపై అలిగిన ఆయన.. అసెంబ్లీకి హాజరు కాలేదు. ఎల్పీ పదవిని ఇద్దరు ఎమ్మెల్యేలు ఆశిస్తుండటంతో.. తమ వారికే ఈ పదవి దక్కాలనే పట్టుదలతో ఇద్దరు కీలక నేతలు రాజకీయం నడపడం రాష్ట్ర బీజేపీలో మరోసారి గ్రూప్ రాజకీయాలకు తావిస్తున్నది. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉండగా.. లెజిస్లేచర్ పదవి కోసం ఓ వైపు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఇంకో వైపు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పోటీ పడుతున్నారు. రాజాసింగ్ ఇంతకు ముందు పార్టీ ఫ్లోర్ లీడర్ గా వ్యవహరించారు. ఇప్పుడు మరోసారి ఆ పదవిపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కూడా దీనిపై కన్నేశారు. మహేశ్వర్ రెడ్డి.. బీజేపీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనా, గతంలో ఒకసారి ఆ పదవిని చేపట్టిన అనుభవం ఉంది. ఇక మిగతా ఆరుగురు ఎమ్మెల్యేలు మొదటిసారి ఎన్నికైన వారే. దీంతో ఈ పదవి కోసం ఇటు రాజాసింగ్, అటు మహేశ్వర్ రెడ్డి మధ్య పోటీ కొనసాగుతోంది.రాజాసింగ్ కోసం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రంగంలోకి దిగారు. ఆయనకు ఎల్పీ పదవి ఇవ్వాల్సిందేనని సంజయ్ హైకమాండ్ వద్ద తన పలుకుబడిని ఉపయోగించి ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీన్ని గమనించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. బండి సంజయ్ ప్రయత్నాలకు చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగారు. మహేశ్వర్ రెడ్డికి ఎల్పీ పదవి ఇవ్వాలని కిషన్ రెడ్డి జాతీయ నాయకత్వం ముందు తన ప్రతిపాదనలు పెట్టారు. దీంతో ఇప్పుడు ఎల్పీ పదవి ఇటు కిషన్ రెడ్డికి అటు సంజయ్కి ఛాలెంజ్గా మారింది.



## మరో రెండు గ్యారంటీల అమలు

**27 లేదా 29వ తేదీన ప్రారంభం**

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : గృహలక్ష్మి, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు వెంటనే సన్నాహాలు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 27వ తేదీ లేదా 29వ తేదీన ఈ రెండు పథకాలను ప్రారంభించాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి కేబినేట్ సబ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం అందించే మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచే పథకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఇప్పుడు మరో రెండు గ్యారంటీలుగా గృహలక్ష్మి, గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ రెండు పథకాల అమలుకు సంబంధించిన ఏర్పాట్లు, అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ప్రజా పాలన దరఖాస్తుదారుల్లో అర్హులందరికీ రూ. 500కు గ్యాస్ సిలిండర్ అందించాలని సీఎం అధికారులకు సూచించారు.



## సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

**రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్ మంత్రి ఆకస్మిక తనిఖీ**

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని మంత్రి గుర్తించారు. ఉన్నతాధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూశాఖ విభాగంలో 11.45 వరకు పూర్తిస్థాయిలో ఉద్యోగులు హాజరు కాలేదు. నిర్లక్ష్యంగా డ్యూటీకి వస్తున్న ఉద్యోగులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. మంత్రి హాజరు పట్టికలు పరిశీలించారు. పదిగంటల కల్లా ఉద్యోగులు విధులకు హాజరు కావాలని వార్నింగ్ ఇచ్చారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215